దొడ్ల నుంచి కొండాయికి సారలమ్మను తీసుకెళ్తున్న భక్తులు

కొండాయిలో గద్దెపై కొలువు దీరిన సారలమ్మ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 12 : మండలంలోని దొడ్ల గ్రామ సారలమ్మ పూజారి కాకా వెంకటేశ్వర్లు బుధవారం కొండాయి కొత్తూరులోని తన ఇంటి నూతన వస్త్రాలు, పూజా సామగ్రితో దొడ్లలోని సారలమ్మ ఆయానికి కాలినడకన వెళ్లారు. సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి సారలమ్మను దొడ్ల నుంచి జంపన్నవాగు మీదుగా కొండాయిలోని గోవిందరాజులు, నాగులమ్మ ఆలయ సన్నిధికి డోలు వాయిద్యాల నడుమ తీసుకవచ్చారు. మల్యాల గ్రామం మీదుగా కొండాయి ప్రవేశిస్తుండగా గ్రామస్తులు, పూజారులు స్వాగతం పలికి గుడి వద్దకు చేర్చారు. రాత్రి వరకు కొండాయిలోని గుడి వద్ద పూజలు చేసి రాత్రి 10 గంటల ప్రాంతంలో గ్రామ పొలిమేరల్లో ఉన్న గద్దెపై ప్రతిష్టించారు. కార్యక్రమంలో పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, దబ్బగట్ల బాబు, రాజారాం, దబ్బగట్ల కృష్ణారావు, వడ్డెలు పొదెం బాబు, అందె విష్ణు, రఘు, దబ్బగట్ల జనార్దన్, దబ్బగట్ల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బయ్యక్కపేటలో సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న లక్ష్మణ్‌బాబు

సమ్మక్కను దర్శించుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

తాడ్వాయి, ఫిబ్రవరి 12 : సమ్మక్క పుట్టు పూర్వం బయ్యక్కపేటలో అమ్మవారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు నాయకులతో కలిసి దర్శించుకున్నారు. చందా వంశీయులు బుధవారం మండె మెలిగే పండగను నిర్వహించగా ఆయన హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కాకులమర్రి మాట్లాడుతూ మేడారంలోనే కాకుండా సమ్మక్క పుట్టిన ఊరిలో అమ్మను దర్శించుకునేందుకు వేలాదిసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని ఇక్కడ కూడా ప్రభుత్వం సౌకార్యలు కల్పించాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు గోవింద్‌నాయక్, మల్లారెడ్డి, ప్రదీప్‌రావు, వలీబాబా, సునీల్, రఘు ఉన్నారు.

సర్వాయి నుంచి సారలమ్మను తీసుకెళ్తున్న పూజారులు, వడ్డెలు

ఐలాపూర్ జాతర ప్రారంభం

సర్వాయి నుంచి సారలమ్మ.. నేడు గొంతెమ్మ గుట్ట నుంచి సమ్మక్క రాక

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 12 : మండలంలోని ఐలాపూర్‌లో రెండేళ్లకు ఒకసారి నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమైంది. బుధవారం సర్వాయి గ్రామంలో 3వ ఘట్టుకు చెందిన నల్లెబోయిన వంశానికి చెందిన పూజారులు మోహన్‌రావు, వంశీ, నర్సయ్య, వడ్డెలు రాజు, సమ్మయ్య, గోవింద్ సారలమ్మను వారి ఇంటి నుంచి సారలమ్మ గుడికి తీసుకోచ్చారు. దీంతో గ్రామస్తులు దర్శించుకోని మొక్కులు చెల్లించారు. అధికారులు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు దర్శించుకున్నారు. సమ్మక్క దేవతను నేడు (గురువారం) మల్లెల వంశస్తులు వనం నుంచి జనంలోకి తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. ఈ సమయంలో దేవతను దర్శించుకొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుంటారని అంచనా వేస్తున్నారు.

కనిపించని సౌకర్యాలు

జాతరకు ప్రభుత్వం రూ.65 లక్షలు కేటాయించినా ఖర్చు చేయడంలో అధికారులు అలసత్వం వహించినట్లు కన్పిస్తున్నది. మరుగుదొడ్లు, మంచినీటి వసతి, పర్యవేక్షణ అధికారులు, ప్రముఖులు కాసేపు సేదతీరేందుకు కనీస ఏర్పాట్లు చేయలేదు. మారుమూల ప్రాంతం కావడంతో కొన్ని పనులు చేయకపోయినా, కొన్ని తూతూ మంత్రంగా చేసి నిధులు స్వాహా చేసే కుట్ర జరుగుతున్నదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొందరు అధికారులు గుత్తేదారులుగా మారి పనులు చేస్తున్నట్లు బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన కొందరు యువకులు కలెక్టర్‌ను కలుస్తామని చెప్పడంతో వారికి కొన్ని పనులు ఇచ్చి అధికారుల బ్యాంక్ ఖాతాలో నగదు జమైన తర్వాత కమీషన్ తీసుకొని వారికి ఇవ్వనున్నట్లు తెలిసింది.

అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ పాలన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ, ఫిబ్రవరి 12 : మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదుల మీద పాలన సాగిస్తున్నదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రేగొండ మండల కేంద్రంలోని ఎస్ఎన్ఎల్ ఫంక్షన్ హాల్‌లో రేగొండ, గోరికొత్తపల్లి మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్యక్షతన జరిగింది. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చి 14నెలలు కావస్తున్నా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు విదేశాలకు, ఢిల్లీకి ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసున్నారని అన్నారు. 14నెలలకే కోట్లల్లో అప్పు చేశారన్నారు. ఇప్పటి వరకు ఒక్క ప్రాజెక్టు కట్టింది లేదన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ద్వారా హైదరాబాద్‌కు నీళ్లు తీసుకుపోతున్నారన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై మౌనంగా ఉన్నామని, అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్పీకర్ ఒకరు మాట్లాడిన దానికి మరొకరికి పొంతన లేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరుతో గ్రామసభలు నిర్వహించి స్థానిక ఎన్నికల్లో మరోసారి మోసం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. డీబీఎం 38కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందళోనలు తప్పవన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యేకు కాంట్రాక్టు, ధన సంపాదన మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదన్నారు. ఆనాడు బీఆర్ఎస్ మంజూరు చేసిన పనులనే తిరిగి ప్రారంభిస్తున్నారు తప్ప కొత్త పనులు ఏమీ తేలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడు ఎంఏ హమీద్, నాయకులు సాంబారి సాయి, ఇంగె మహేందర్, కొల్గూరి రాజేశ్వర్‌రావు, కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్, కుసుంభ రంజిత్, జీ లింగయ్య, నీలాంబరం ఉన్నారు.

మిర్చికి మద్దతు ధర ఇవ్వాలని గాంధీ విగ్రహానికి వినతి

మిర్చిపంటకు ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రేగొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల ర్యాలీలో ఆయన పాల్గొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీ విగ్రహానికి అందజేశారు. అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మిర్చిపంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.20,500 ప్రకటించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి కనువిప్పు కలిగి హామీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోలెపాక భిక్షపతి, రాజేందర్, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటాలు తప్ప..
పథకాల అమలు జాడేది

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 12 : ప్రభుత్వం పథకాల పేరుతో ప్రచార ఆర్భాటాలు చేస్తుంది తప్ప పథకాల అమలును మరిచిందని మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. మండలంలోని బంగ్లపల్లి, వేములపల్లి, కాసులపాడు గ్రామాల్లో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడారి రమేశ్, జిల్లా నాయకుడు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యహంపై నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ విధానాన్ని ఎండగట్టాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు దానవేణి రాములు, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, బద్దం జైపాల్‌రెడ్డి, అనబోయిన కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్, అరెల్లి రమేశ్, అనుముల శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి, ముకుందరెడ్డి, దోమకుంట్ల రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సమోజి ఓదెలు, మాజీ ఉపసర్పంచ్ ఏడాకుల రాజురెడ్డి, పోయిల రాజు, ఉప్పుల రాజు, అంజద్‌పాషా, గోనెల సాంబయ్య, రఘుపతి, బొల్లం మొగిలి పాల్గొన్నారు.

పెద్దపులి జాడ కోసం కొనసాగిన గాలింపు

కాటారం, ఫిబ్రవరి 12 : పెద్దపులి జాడ కోసం మూడో రోజు కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలోని అటవీ అధికారులు బుధవారం కాటారం ఎఫ్ఆర్వో స్వాతి నేతృత్వంలో కాటారం రేంజ్ అడవుల్లో గాలించారు. నస్తూరుపల్లి నుంచి వీరాపూర్ అడవుల్లో పలు చోట్ల, వాగుల వద్ద పులి ఆచూకీ కోసం పరిశీలించారు. అయితే బుధవారం పులి పాదముద్రలు అడవుల్లో కనిపించకపోవడంతో వేరే ప్రాంతానికి వెళ్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అడవుల చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అడవుల్లోకి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గాలింపులో కాటారం, మహదేవపూర్, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు సుమన్, అశ్విన్, అటవీఅధికారులు సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

ఫిబ్రవరి 14న సింగరేణి పాఠశాల వార్షికోత్సవం

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : ఫిబ్రవరి 14న సింగరేణి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భూపాలపల్లి సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం భూపాలపల్లి జీఎం కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో ఫీజుతోనే ఉన్నత విద్యను అందిస్తున్నామని, సింగరేణిలో వివిధ డివిజన్ల నుంచి బదిలీపై వచ్చిన కార్మికుల పిల్లల చదువు కోసం 2004జూన్‌లో 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు సింగరేణి పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దశల వారీగా పదో తరగతి వరకు పెంచామన్నారు. ఫిబ్రవరి 14న పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో చదివిన పలువురు విద్యార్థులు వివిధ హోదాల్లో స్థిరపడ్డారని తెలిపారు.

రవిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, ఫిబ్రవరి 12 : మండలంలోని పలు బాధిత కుటుంబాలను బుధవారం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరార్శించారు. మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ పల్లి గ్రామానికి చెందిన తోట రవి ఇటీవల ఇసుక లారీ ఢీకొని తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు కోల్పోగా రవి, అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. రవికి అండగా ఉంటామని మనోధైర్యాన్చిచ్చారు. బయ్యారం గ్రామంలో పసుల సమ్మయ్య, గారెపల్లిలో కడారి దుర్గయ్య, అక్కపాక మణమ్మలు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిల్ల కిరణ్, నాయకులు పంతకాని సడువలి, మెడిగడ్డ దుర్గారావు, గాలి సడువలి, సంతోష్, మల్లయ్య, లింగయ్య ఉన్నారు.

ఇసుక లారీలతో నిత్యం ప్రమాదాలు

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 12 : ఇసుక లారీలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇసుక లారీల బీభత్సంతో కాటారం, మహదేవపూర్, కాళేశ్వరం జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయని తెలిపారు. ఇటీవల కాటారంలో లారీ ప్రమాదంతో ఓ యువకుడు రెండు కాళ్లు కోల్పోగా, తాజాగా మహదేవపూర్‌లో మరో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక లారీల ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

యాసంగిసాగు విస్తీర్ణం 1,25,118ఎకరాలు

జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు మొత్తం 1,25,118 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వరి 85,675 ఎకరాలు, మొక్కజొన్న 16,843ఎకరాలు, ఇతర, ఉద్యాన పంటలతో కలిపి 22,670 ఎకరాలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు 18,800 టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశామని, నవంబర్ మొదటివారం నుంచి ఇప్పటివరకు రైతులు 10,513 టన్నులు కొనుగోలు చేశారని తెలిపారు. ఇంకా 2570 టన్నులు నిల్వ ఉందని, జిల్లాకు 5,717 టన్నులు అవసరం ఉంటుందని, ఫిబ్రవరి, మార్చి నెలలో రైతాంగానికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా 2వేల టన్నుల యూరియా కమిషనర్ కేటాయింపు చేసినట్లు తెలిపారు. దాదాపుగా అన్ని ఎరువుల దుకాణాల్లో నానో యూరియా అందుబాటులో ఉందని, ఇది యూరియా కంటే కూడా ఉత్తమంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారణ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో నానో యూరియాను సమర్థవంతంగా వాడుకొని పంట దిగుబడి సాధించాలని ఆయన సూచించారు.

చెరువులను ఎందుకు అనుసంధానం చేయడం లేదు

సంఘం మహాసభలో మాట్లాడుతున్న పద్మ

ములుగురూరల్, ఫిబ్రవరి 12 : జిల్లా నుంచి దూర ప్రాంతాలకు సాగు నీరు తరలిస్తున్న పాలకులు ఈ జిల్లాలోని చెరువులకు నీటిని ఎందుకు అనుసందానం చేయలేకపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పష్య పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో బుధవారం జరిగిన సంఘం మహా సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి చొరవ తీసుకొని చెరువులకు నీటిని అనుసందానం చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గుల వాగుపై డ్యాం నిర్మిస్తే 300 ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందనున్నట్లు తెలిపారు. పొట్లాపూర్ ఎడుళ్ల చెరువు నుంచి నర్సంపేట రంగాయ చెరువుకు నీటిని తరలిస్తున్నారని, ఎడుళ్ల చెరువు వద్ద చెక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. దీని ద్వారా వందలాది ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. వాజేడు మండలంలోని మోడికుంటవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని, రుణమాఫీ పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జంపీల ర వీందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి, మామిడాల సమ్మిరెడ్డి, సదాలక్ష్మి, నాయకులు అమ్జద్‌పాషా, ఇంజం కొమురయ్య, శ్రీనివాస్, నాసర్, అయిలయ్య, శ్యామ్, మత్తయ్య, లక్ష్మయ్య, రమేశ్, సమ్మయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

జాకారం జీపీకి ఆదాయం వచ్చేలా చూడాలి

ములుగు, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ) : గట్టమ్మ దేవాలయం జాకారం జీపీ పరిధిలో ఉందని, అధికారులు మేడారం మినీ జాతర సందర్భంగా జీపీకి వచ్చే ఆదాయంపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ దాసరి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతర సమయంలో ప్రతిసారి జీపీ ఆధ్వర్యంలో టెండర్లను నిర్వహించి దుకాణాలను ఏర్పాటు చేసేవారని అన్నారు. ప్రస్తుతం స్పెషల్ అధికారులు నిబంధనలు అతిక్రమించి దుకాణాలను ఏర్పాటు చేయించి భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి జీపీ ఆదాయానికి గండిపడేలా చేస్తున్నారన్నారు. స్థానిక మంత్రి చోద్యం చూస్తున్నారే తప్పా టెండర్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించడం లేదన్నారు. ఇప్పటికైనా గట్టమ్మ వద్ద కొనసాగుతున్న షాపులను గ్రామ పంచాయతీకి అప్పగించి జీపీకి ఆదాయం వచ్చేలా చూడాలని కోరారు.

డ్రైటాయిలెట్స్, మరుగు దొడ్లను పూర్తిగా కూల్చి వేయాలి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : డ్రై టాయిలెట్స్, మరుగు దొడ్లను పూర్తిగా కూల్చి వేయాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సూచించారు. బుధవారం సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం విజయ లక్ష్మీ అధ్యక్షతన ఐడీవోసీ కార్యాలయంలో మాన్యువల్ స్కావెంజర్స్ జిల్లా స్థాయి సర్వే కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లా కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి డ్రై టాయిలెట్స్, మాన్యువల్ స్కావెంజర్స్ వివరాలు సేకరించి వాటిని పూర్తిగా కూల్చివేయాలన్నారు. సర్వే నివేదికను ఈ నెల 15వ తేదీ వరకు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, మున్సిపాల్ కమిషనర్, రెవెన్యూ డివిజన్ అధికారి, సబ్‌కలెక్టర్ (కాటారం), ఎన్‌జీఓఎస్, నాన్ అఫిషల్ మెంబర్ వనిత, శంకర్, శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి

మహా జాతరలో తప్పిపోయిన వ్యక్తి

ఫ్లెక్సీతో బంధువులు

ఫ్లెక్సీతో కుమారుడు, బావమరిది

ములుగురూరల్, ఫిబ్రవరి 12 : 2024 మేడారం మహా జాతరకు వచ్చిన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన జీపీ వర్కర్ జంగిడి వెంకటయ్య తప్పిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఆచూకీ దొరకకపోవడంతో వెంకటయ్య కుమారుడు రాము, బావమరిది సుభాష్ బుధవారం మేడారానికి వచ్చారు. వెంకటయ్య ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని పట్టుకొని భక్తులు ఉన్న ప్రతి చోటుకు వెళ్లి వాకబు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా జాతర సమయంలో వచ్చిన వెంకటయ్య బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. జాతరలో ఎక్కడ వెతికిన దొరకలేదని తెలిపారు. చాలా రోజుల తర్వాత కొంత మంది వెంకటయ్యను చూసినట్లు తెలిపారని, వారు తెలిపిన ప్రాంతాలకు వెళ్లినా అక్కడ కనపించలేదన్నారు. కొన్ని నెలల క్రితం భూపాలపల్లి ప్రాంతానికి బస్సు ఎక్కి వెళ్లినట్లు తెలిపారని అన్నారు. అయితే మతిస్థిమితం సరిగాలేక వెంకటయ్య గతంలో రెండు సార్లు ఇలా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, గుర్తు వచ్చిన తర్వాత తిరిగి ఇంటికి వచ్చేవాడని తెలిపారు. ప్రస్తుత జాతరకు వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నందున వారి ప్రాంతాల్లో ఏమైనా చూసి ఉంటే జాడ చెప్తారనే ఆశతో ఫ్లెక్సీతో తిరుగుతున్నామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 7995454146కు సమాచారం ఇవ్వాలని వేడుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు కూడా నమోదైందని వివరించారు.

అధికారుల తనిఖీలతో ఇసుక అక్రమార్కుల్లో వణుకు

రహదారి పక్కనే డంపు చేస్తున్న ఘటనలు

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లోని అక్రమాలపై అధికారులు జరుపుతున్న ఆకస్మిక తనిఖీలతో నిర్వాహకులు, ఇసుక లారీల డ్రైవర్లు బెంబేలెత్తుతున్నారు. ఇసుక క్వారీల్లో జరుగుతున్న ఎక్స్ట్రా బకెట్ దందా, లోడింగ్ చార్జీలతోపాటు పలు అక్రమాలు వెలుగులోకి రావడంతో ఇటీవల మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. తనిఖీలతో ఇబ్బందులు తప్పవని భావించిన పలువురు ఇసుక లారీ డ్రైవర్లు బుధవారం మార్గమధ్యంలోనే ఇసుకను మహదేవపూర్ ప్రధాన రహదారి పక్కనే డంపు చేస్తున్న ఘటనలు పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది.

మహదేవపూర్ రహదారిపై లారీ డ్రైవర్లు డంపు చేసిన ఇసుక

పోలీస్ పహరాలో ఇసుక లోడింగ్

మహదేవపూర్(కాళేశ్వరం) : మండలంలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలలో పోలీస్ పహరాలో ఇసుక లోడింగ్ నిర్వహిస్తున్నారు. ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వ నిర్ణయం మేరకు బుధవారం నుంచి మండలంలోని ఆయా ఇసుక క్వారీల్లో పోలీస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇసుక లోడింగ్ చేస్తున్నారు.

పంట పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మా భూములు లాక్కోవద్దు

కాళేశ్వరంలో రైతుల నిరసన

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 12 : మండలంలోని కాళేశ్వరంలో నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణానికి తమ భూములను లాక్కోవద్దని పలువురు రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి కోసం తమకున్న కొద్ది పాటి భూమిని లాక్కుంటే తాము నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కాళేశ్వరంలో 'గోదావరి హారతి'

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 12 : మండలంలోని కాళేశ్వరంలో ప్రతి నెల పౌర్ణమి నాడు నిర్వహించే గోదావరి హారతి కార్యక్రమం బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు శ్రీకాళేశ్వరముక్తీశ్వర ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో గోదావరి నదికి వెళ్లి గోదావరిహారతి కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మహేశ్, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

మహదేవపూర్, ఫిబ్రవరి 12 : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజేందర్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీలు చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, కాంప్లెక్స్ హెచ్ఎం బండం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సాంబయ్య, కుమారస్వామి, సీఆర్పీ మహేశ్, మెసెంజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

మంగపేట, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, హైస్కూల్‌ను బుధవారం డీఈవో పాణిని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేసి, ఉత్తమ ఫలితాలు వచ్చేలా బోధన చేయాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో మేనక, ఉపాధ్యా